www.prajasakti.com

ప్రజాశక్తి

గురువారం 30 జనవరి 2025

5

డాక్టర్ బిఆర్.అంబేద్కర్

కోనసీమ

కొనసాగుతున్న పూడికతీత

ప్రజాశక్తి - రామచంద్రపురం

రబీ సీజన్లో రైతులకు నీటి కొరత రాకుండా ఇరిగేషన్ అధికారులు చేపట్టిన కాలు వలలో పూడికతీత కార్యక్రమం విజయ వంతంగా కొనసాగుతోంది. కాలువల్లో పెరిగిన తోటి కాడ, గుర్రపు డెక్క, వ్యర్ధ పదా ర్థాలను ప్రొక్లైనర్ల సహాయంతో తొలగిస్తు న్నారు. వెంకటాయపాలెం నుంచి ఇంజరం వరకు పంట కాలువ అభివృద్ధి పనుల వల్ల నీటి లభ్యత పెరిగి దాల్వా రైతులకు ఊరట లభించింది. వెంకటాయపాలెం నుంచి ఇంజరం వరకు పంట కాలవ అభివృద్ధి వల్ల రామచంద్రపురం మండలం కె.గంగవరం మండలం, కాజులూరు మండలాల్లోని సుమారు 4500 ఎకరాల రైతులకు లబ్ది చేకూరుతుంది.

పంట కాలువలకు పెరిగిన సాగునీరు

ఎంఎల్‌సి ఎన్నికల నగారా

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

తూర్పు, పశ్చిమ ఉభయ గోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఎన్నికల నగారా మోగింది. బుధవారం దీనికి సంబంధించిన షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల కమిషన్ విడుదల చేసింది. దీంతో ఒక్కసారిగా ఎన్నికల కోలాహలం ఊపందుకుంది. ఫిబ్రవరి మూడో తేదీన ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానుంది. పదోతేదీ వరకూ నామినేషన్ల స్వీకరణ కొనసాగనుంది. 13వ తేదీతో ఉపసంహరణ ముగియనుంది. 27వ తేదీన ఎన్నికల పోలింగ్, మార్చి మూడో తేదీన ఎన్నికల కౌంటింగ్ జరనుంది. ఉభయ గోదావరి జిల్లాల పరిధిలో విభజించిన ఏలూరు, పశ్చిమ, అల్లూరి సీతారామరాజు, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ, తూర్పు గోదావరి, కాకినాడ జిల్లాల పరిధిలో ఎన్నికల ప్రక్రియ జరగనుంది. ఆరు జిల్లాల పరిధిలో మొత్తం 440 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. ఎన్నికల్లో మొత్తం 3,15,261 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనుండగా, ఇందులో పురుష ఓటర్లు 1,83,734 మంది, మహిళా ఓటర్లు 1,31,507, థర్డ్ జండర్ ఓటర్లు 20 మంది ఉన్నారు. నామినేషన్ల తేదీ వరకూ కొత్త ఓటర్లు నమోదు చేసుకునే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

అమల్లోకి ఎన్నికల కోడ్

గ్రాడ్యూట్ ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో బుధవారం నుంచే ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినట్లు జిల్లా కలెక్టర్ సన్మోహన్ సగిలి ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో ప్రభుత్వ అధికారిక కార్యక్రమాలు నిలిచిపోనున్నాయి. సాధారణ ఎన్నికలకు వర్తించే అన్ని నిబంధనలూ అమల్లోకి రానున్నాయి. ప్రభుత్వం మంజూరు చేసిన కొత్త పనులు ఏవీ చేపట్టడానికి వీలుండదు. ప్రజాప్రతినిధులు అధికారిక కార్యక్రమాల్లో పాల్గొనడంపై ఆంక్షలు ఏర్పడనున్నాయి.

రిటర్నింగ్ అధికారిగా ఏలూరు జిల్లా కలెక్టర్

ఉభయ గోదావరి జిల్లాలో ఉపాధ్యాయ, గ్రాడ్యుయేట్ ఎంఎల్‌ఎసి ఎన్నికలకు సంబంధించి ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా కాకినాడ జిల్లా కలెక్టర్ వ్యవహరించేవారు. ఎంఎల్‌సి ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ, కౌంటింగ్ ఎన్నికల ప్రక్రియ అంతా కాకినాడ నుంచే జరిగేది. గ్రాడ్యుయేట్స్ ఎంఎల్‌ఎసి ఎన్నికలకు సంబంధించి రిటర్నింగ్ అధికారిగా ఏలూరు జిల్లా కలెక్టర్‌ను నియమించారు. దీంతో గ్రాడ్యుయేట్ ఎంఎల్సి ఎన్నికల ప్రక్రియ అంతా ఏలూరు కేంద్రంగా జరగనుంది. ఎన్నికలకు సంబంధించి మీడియా సెంటర్‌తో పాటు అన్నీ ఏలూరులోనే ఏర్పాటు కానున్నాయి.

టిడిపి, పిడిఎఫ్ మధ్య పోటీ

ఉభయ గోదావరి జిల్లా గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఎన్నికలకు సంబంధించి టిడిపి, పిడిఎఫ్ అభ్యర్ధి మధ్య పోటీ ఉండనున్నట్టు చెప్పొచ్చు. ఇప్పటికే టిడిపి పేరాబత్తుల రాజశేఖర్‌ను అభ్యర్థిగా ప్రకటించగా పిడిఎఫ్ అభ్యర్థిగా ఉపాధ్యాయునిగా పని చేసి రిటైరైన డివి.రాఘవులును అభ్యర్థిగా ప్రకటించారు.

ఫిబ్రవరి 27న గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఎన్నిక

తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల పట్టబద్రుల నియోజకవర్గ ఎన్నికకు సంబంధించిన షెడ్యూల్‌ను ఎన్నికల కమిషన్ బుధవారం విడుదల చేసింది. ఈ మేరకు కలెక్టర్ షాన్‌మోహన్ సగలి బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎన్నికల కమిషన్ విడుదల చెసిన షెడ్యూల్ ప్రకారం ఫిబ్రవరి 3న నోటిఫికేషన్ జారీ చేస్తారన్నారు. అదే నెల 10వ నామినేషన్‌ల స్వీకరణకు ఆఖరి తేదీ కాగా, ఫిబ్రవరి 11న నామినేషన్ల స్క్రూటినీ చేస్తారని తెలిపారు. నామినేషన్ల స్వీకరణకు ఫిబ్రవరి 13వ తేదీ ఆఖరు తేదీ కాగా ఫిబ్రవరి 27న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ నిర్వహిస్తామన్నారు. మార్చి 3న ఓట్ల లెక్కింపు చేసి విజేతను ప్రకటిస్తామని తెలిపారు. మార్చి 8వ తేదీతో ఎన్నికల ప్రక్రియ పూర్తవుతుందన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చిందని ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు కోడ్ అమల్లో ఉంటుందని తెలిపారు.

రావులపాలెం ఆర్‌టిసి బస్టాండ్ వద్ద జాతీయ రహదారిపై నినాదాలు చేస్తున్న స్టీల్ ప్లాంట్ రక్షణ జాతా నాయకులు

విశాఖ ఉక్కుకు గనులు కేటాయించాలి

ప్రజాశక్తి - రావులపాలెం

విశాఖ ఉక్కు ప్రయివేటు పరం చేయకుండా గనులు కేటాయించాలని స్టీల్ ప్లాంట్ రక్షణ జాతా నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం మండలకేంద్రం రావులపాలెం కళా వెంకట్రావు విగ్రహం జాతీయ రహదారి వద్ద స్టీల్ ప్లాంటు రక్షణ జాతా నాయకులకు అంబేద్కర్ కోనసీమ జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యులు జి.దుర్గా ప్రసాద్, నూకల బలరాం, సిపిఎం కార్య కార్తలు పెద్ద ఎత్తున పాల్గొని ఘనస్వాగతం స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిపిఎం రాష్ట్ర మహాసభలు ఫిబ్రవరి 1 నుంచి 3వ తేదీ వరకూ నెల్లూరులో నిర్వహిస్తారన్నారు. ఈనేపథ్యంలోజాతా ఈ నెల 31వ తేదీ నెల్లూరు వరకూ నిర్వహిస్తార న్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ పునర్జీవనానికి ఈ ఏడాది జనవరి 17న కేంద్రం రూ.11,440 కోట్ల ఆర్థిక ప్యాకేజీని ప్రకటించిందన్నారు. ప్యాకేజీ తాత్కాలిక ఉపశమ న్నారు. ప్యాకేజీని సిపిఎం స్వాగతిస్తోందన్నారు. ఉక్కు సంకల్పంతో విశాఖ ఉక్కు కార్మికులు, రాష్ట్ర ప్రజలు, కార్మికులు, ప్రజాసంఘాలు చేస్తున్న పోరాట ఫలితమిదన్నారు. ఈ పోరాటంలోను, ఉక్కు రక్షణ లోను భాగస్వాములుగా ఉన్న ప్రతి ఒక్కరిని సిపిఎం పార్టీ హృదయపూర్వకంగా అభినందిస్తున్న దన్నారు. స్టీల్ ప్లాంటు లాభాల బాటపట్టాలంటే స్టీల్ ప్లాంట్ అమ్మే నిర్ణయాన్ని కేంద్ర బిజెపి ప్రభుత్వం తక్షణమే రద్దు చేయాలని,సెయిల్లో విలీనం చేయాలని, సొంతగనులు కేటాయించాలని, సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ కేంద్రాన్ని ఒప్పించి ఈ ప్రకటన చేయించాలన్నారు.ఇది సాధించేవరకు విశాఖ ఉక్కు కార్మికులకు అండగా రాష్ట్ర ప్రజలు, కార్మికులు, ప్రజాసంఘాలు ఈ పోరాటంలో తమ వంతు భాగస్వామ్యం కొనసాగించాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. కేంద్ర ప్యాకేజీతోనే విశాఖ ఉక్కు భవిష్యత్తు మారిపోతున్నట్లు, సమస్య పరిష్కారమైపోయినట్లు ప్రధాని, కేంద్ర మంత్రులు, సిఎం, ఉపముఖ్యమంత్రి మొదలుకొని టిడిపి, జనసేన, బిజెపి కూటమి నేతలు ప్రకటనలు గుప్పిస్తున్నారన్నారు. ఈ ప్యాకేజీ తాత్కాలిక ఉపశమనం అన్న అంశాన్ని మరుగున పరచాలని చూస్తున్నారన్నారు. ఇదే సందర్భంలో కార్మికులకు అండగా నిలవాల్సిన బిజెపి ప్రజాప్రతినిధులు కార్మికులను దోషులుగా నిలిపి, కార్పొరేటర్లకు అండగా నిలుస్తున్నారన్నారు. స్టీల్ ప్లాంట్‌ను కేంద్రంలోని మోడీ ప్రభుత్వం 2021 జనవరి 27న స్ట్రాటజిక్ సేల్ పేరుతో వంద శాతం అమ్మకానికి పెట్టిందన్నారు. నేటికీ విశాఖ ఉక్కు మెడపై మోడీ ప్రభుత్వ ప్రయివేటు కత్తి వేలాడుతూనే ఉందన్నారు. దీన్ని రద్దు చేయకుండా ప్లాంట్ ప్రభుత్వరంగంలో బతకడం ఎలా సాధ్యమన్నారు. చంద్రబాబు, పవన్, కూటమినేతలు స్టీల్ ప్లాంటు అమ్మకం జరగదని ప్రకటిస్తున్నారని అన్నారు. అయితే కేంద్రం ప్రకటించడంలేదన్నారు.. ప్లాంట్ అమ్మకానికి పెట్టింది మోడీ ప్రభుత్వం. కేంద్రమే అమ్మకం రద్దు చేస్తున్నట్లు ప్రకటించాలన్నారు. అప్పుడే విశాఖ స్టీల్ప్లాంటుకు రక్షణ వుంటుందన్నారు. దేశంలో అన్ని ప్రభుత్వరంగ, ప్రయివేటు రంగ స్టీల్ ప్లాంట్లకు సొంత గనులు కేటాయించారన్నారు. లక్ష మందికి ఉపాధి కల్పిస్తున్న విశాఖ ఉక్కుకు సొంత గనులు అడగడం లేదనీ సొంతగనులు కేటాయిస్తే స్టీల్ ప్లాంట్ అప్రతిహతంగా ముందుకు దూసుకుపోతుందన్నారు. ఈ కార్యక్రమంలో సఖిలే సూర్యనారాయణ, విపర్తి మోహన్ రావు, తాడి శ్రీరామ్ మూర్తి, ఎం భాస్కర్ రావు, పీతల రామచంద్రరావు, లక్ష్మి, పార్వతి, కె పాపారావు, పి.సాయి, కె.బన్నీ, శివ, గణేష్ కార్మికులు పాల్గొన్నారు.

మార్చి 8న జాతీయ లోక్ అదాలత్

ప్రజాశక్తి - అమలాపురం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాదికార సంస్థ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ వారి ఆదేశాను సారం మార్చి 3న మండల లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో నేషనల్ లోక్ అదాలక్ నిర్వహిస్తారని రెండవ అదనపు జిల్లా జడ్జి, మండల లీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్మన్ వి. నరేష్ బుధవారం ప్రకటనలో తెలిపారు. ఈ జాతీయ లోక్ అదాలత్‌లో పెండింగ్ లో ఉన్న సివిల్ కేసులు, బ్యాంకు కేసులు, చెక్ బౌన్స్ కేసులు, రాజీ పడదగ్గ క్రిమినల్ కేసులు పరిష్కరిస్తారన్నారు.కక్షిదారులు అధిక సంఖ్యలో పాల్గొని మార్చి 3వ తేదీ ఉదయం 10.30 గంటలకు నిర్వహించే జాతీయ లోక్ అదాలత్లో తమ తమ కేసులను పరిష్క రించుకోవలసిందిగా నరేష్ తెలిపారు.ఈ జాతీయ లోక్ అదాలత్ లో న్యాయవాదుల, అధికారులు, బ్యాంక్ అధికారులు, రెవిన్యు అధికారులు అందరు పాల్గొని ఎక్కువ కేసులు పరిష్కరించుటకు సహకరించాలని ఆయన కోరారు.

పాఠశాలల్లో డిఇఒ తనిఖీ

ప్రజాశక్తి - మామిడికుదురు

మండలంలోని నగరం, ఈదరాడ, మగటపల్లి హైస్కూళ్లను డిఇఒ షేక్ సలీం బాషా బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు టెన్త్ విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలపై పలు సూచనలు, సలహాలు తెలియజేశారు నగరం ఈదరాడ, మగటపల్లి, కరవాక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలు సందర్శించి జరుగుతున్నఎస్ ఎఎంపి-3 పరీక్ష పేపర్లు పరిశీలించారు వీరి వెంట మండల విద్యాశాఖ అధికారులు లక్ష్మీనారాయణ, ఎం.వెంకన్నబాబులు పాల్గొన్నారు

నగరం హైస్కూల్లో టెన్త్ విద్యార్థులకు సూచనలు ఇస్తున్న డిఇఒ

ఎల్ఐసి ఏజెంట్ల సమస్యలపై ఎంపీకి వినతి

ప్రజాశక్తి - అమలాపురం రూరల్

ఎల్ఐసి ఏజెంట్ల సమస్యలను ఎంపీ గంటి హరీష్ మాదుర్‌కు ఎఒఐ నాయకులు వినతి పత్రం అందజేశారు. ఏజెంట్స్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా పిలుపుమేరకు రాజమహేంద్రవరం డివిజన్ వారి ఆధ్వర్యంలో అమలాపురం ఏజెంట్స్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా యూనియన్ అధ్యక్షుడు సానబోయిన వీరభద్రరావు అధ్యక్షతన బుధవారం ఎంపీ హరీష్ మాదుర్‌ను కలిశారు. దీనిలో భాగంగా ఎల్ఐసి యాజమాన్యంలో వచ్చిన మార్పులు పాలసీపై జిఎస్‌టి తగ్గించాలని ఏజెన్సీ కు తగ్గించిన కమిషన్ను పెంచాలని, పోర్టబిలిటీ ఒక ఏజెంట్ చేసిన పాలసీని వేరొక ఏజెన్సీకు బదిలీని రద్దు చేయాలని, గ్రూప్ టర్మ్ ఇన్సూరెన్స్ వయస్సు పెంచి ఏజెంట్స్ ఇన్సూరెన్స్ కల్పించాలని వివిధ రకాల సమస్యలపై తమకు న్యాయం చేయాలని ఎంపీని కోరారు. అనంతరం వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సెక్రెటరీ గుమ్మలూరి వినాయకరావు, ట్రెజరర్ దొమ్మేటి శివస్వామి, అధికారి బాబ్జి, కోరుమిల్లి మధు, మట్ట దుర్గా శ్రీనివాస్ గౌడ్, కేత వీరాస్వామి, కడలి శ్రీనివాసరావు, శీలం లంకేశ్వరుడు తదితరులు పాల్గొన్నారు.

అమలాపురంలో ఎంపీ హరీష్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఎఒఐ నాయకులు

గ్రామాల అభివృద్ధే లక్ష్యం : ఎంఎల్‌ఎ

ప్రజాశక్తి - ఆత్రేయపురం

గ్రామాల సమగ్ర అభివృద్ధే లక్ష్యమని నియోజకవర్గ ఎంఎల్‌ఎ బండారు సత్యానందరావు అన్నారు. బుధవారం మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపిపి కుండ అన్నపూర్ణ అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఎంఎల్ఎ బండారు సత్యానందరావు పాల్గొన్నారు . ఈ సందర్భంగా ఎంపిపి కె.అన్నపూర్ణ 25-26 సంవత్సరం సంబంధించిన అంచనా బడ్జెట్ను ప్రవేశపెట్టగా సభ్యులంతా ఆమోదించారు. అనంతరం సభ్యులు పలు సమస్యలను లేవనెత్తారు. వెలిచేరు ఎంపిటిసి సభ్యుడు వేములు వెంకన్న బాబు మాట్లాడుతూ వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయానికి కాలినడకన వచ్చే యాత్రికులకు సరైన సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. బొబ్బర్లంక నుంచి లొల్ల. గ్రామం వరకు వీధిలైట్లు, వాష్ రూమ్ లో విశ్రాంతి తీసుకునేల షెడ్లు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. జల జీవన్ మిషన్ పథకంలో పనులు మొదలెట్టి సకాలంలో వదిలేయడంతో మండలంలోని శివారు గ్రామ ప్రాంత వాసులు తాగునీరు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సభ్యులు సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. అలాగే గ్రామాల్లో లోల్టేజీతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వెంటనే ఆ సమస్యలను పరిష్కరించాలంటూసభ్యులు కోరారు. నార్కెడిమిల్లి సర్పంచ్ పాల నాగేశ్వరరావు మాట్లాడుతూ రిజిస్టర్ కార్యాలయం నుండి పంచాయతీలకు రావలసిన స్టాంప్ డ్యూటీ రావట్లేదని ఈ సమస్యను ఎన్నిసార్లు విన్నవించుకున్న అధికారులు పట్టించుకోవట్లేదు అన్నారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ బొబ్బర్లంక నుంచి లొల్ల గ్రామం వరకు వీధిలైట్లు ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని విద్యుత్ శాఖ జారీ చేశారు. అలాగే గ్రామాలలో సమస్యలు లేకుండా చూడాలన్నారు. వేసవి సమీపిస్తున్నందున ఇప్పటికే చేపట్టిన జలజీవన్ మిషన్ పనులు పూర్తి చేసి గ్రామీణ ప్రాంత ప్రజలకు తాగునీరు అందజేయాలని ఆర్డబ్ల్యూఎస్ ఎఇ శ్రీధర్‌ను ఆదేశించారు. అధికారులంతా సమన్వయంతో పనిచేసే గ్రామాల అభివద్ధికి సహకరించడంతో పాటు గ్రామాలలో సమస్యలు పరిష్కరించాలని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ బికెఎస్ఎస్.వెంకట్రామన్, తహశీల్దార్ టి.రాజేశ్వరరావు, సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆత్రేయపురం మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎల్ఎ సత్యానందరావు

కిశోర బాలికల సంరక్షణకు కృషి చేయాలి

ప్రజాశక్తి - రావులపాలెం

కిశోర బాలికలకు సంరక్షణకు గ్రామ స్థాయి కమిటీల సభ్యులు కషి చేయాలని ఐసిడిఎస్ కొత్తపేట ఇన్‌ఛార్జి సిడిపిఒ ఎ.గజలక్ష్మి సూచిం చారు. రావులపాలెం మండలపరిషత్ కార్యాలయం లో బుధవారం గజలక్ష్మి అధ్యక్షతన కిషోరి వికాసం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఎంపిడిఒ ఇ.మహేశ్వరరావు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్ర మాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా రిసోర్స్ పర్సన్ గ్రామ స్థాయి కమిటీలకు శిక్షణ ఇచ్చారు. 11 నుంచి 18 ఏళ్ళ లోపు బాల బాలికలకు, సంపూర్ణ ఆహారం, ఆరోగ్యం, నైపుణ్య ఉపాధి, ఆత్మరక్షణ, లింగ వివక్ష, బాల్య వివాహాలు అరికట్టడం, మానవ అక్రమ రవాణా నిర్మూలన తదితర అంశాలపై అవగాహన కల్పిం చారు. గజలక్ష్మి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదేశాలు మేరకు కిశోర వికాసం శిక్షణా తరగతులు నిర్వహిస్తారన్నారు. ఈ గ్రామ స్థాయి కమిటీలో ఉపాధ్యాయులు, ఏఎన్ఎంలు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, అంగన్ వాడీ కార్యకర్తలు, జిఎం.ఎస్‌కెలు సభ్యులుగా ఉంటారన్నారు. ఉన్నత పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో కిశోర బాలికలకు గ్రామ స్థాయి కమిటీల ద్వారా పలు అంశాలపై శిక్షణ ఇస్తారన్నారు. ఈ కార్యక్ర మంలో గోపాలపురం, ఊబలంక పి.హెచ్.సి వైద్యాధికా రులు కె.స్వాతి, శ్రీకాంత్, రిసోర్స్ పర్సన్ టి.గంగా వతి, పోతుమూడి శేషారత్నం, సాకా రాజారావు, విఎస్ఆర్.లక్ష్మి, ఎస్‌జిటికెఎస్.కృష్ణ కాంత్, వై.హిమ శ్రీ, జి.నాగ సత్యవేణి, ఎస్‌కె.ఫాతి మా బేగం, ఉపాధ్యాయులు, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బం ది, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

శిక్షణా తరగతులు ప్రారంభిస్తున్న ఎంపిడిఒ మహేశ్వరరావు

పారదర్శంగా 'ఉపాధి' పనులపై సోషల్ ఆడిట్

ప్రజాశక్తి - మామిడికుదురు

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టంలో నిర్వహించిన పనులపై సోషల్ ఆడిట్ పారదర్శకంగా నిర్వహిస్తామని ఎస్ఆర్‌సి కనకారావు తెలిపారు మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం సోషల్ ఆడిట్ నిర్వహణపై కోఆర్డినేటర్ సమావేశం నిర్వహించారు. ఎపిఒ రమేష్ బాబు మాట్లాడుతూ గురువారం నుంచి ఫిబ్రవరి 10 వరకు గ్రామాల్లో సోషల్ ఆడిట్ నిర్వహిస్తారన్నారు. 2023-24 ఆర్థిక సంవత్సరములో మండల పరిధిలో రూ.5.50 కోట్ల విలువైన 882 ఉపాధి హామీ పనులు నిర్వహించామన్నారు. ఈ సమావేశంలో ఎంపిడిఒ కె.వెంకటేశ్వరరావు, సర్పంచుల సమాఖ్య నియోజకవర్గ అధ్యక్షుడు అడబాల తాతకాపు, మామిడికుదురు ఎంపిటిసి సభ్యులు నైనాల సీతామహాలక్ష్మి, జెఇ పి.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు

కోఆర్డినేటర్ సమావేశంలో ప్రసంగిస్తున్న ఎస్ఆర్‌సి కనకారావు

కార్టూ'నిజం'



పొంచి ఉన్న ప్రమాదం

- రహదారికి రక్షణ గోడ కరువు
- పంట బోదెల తూముల వద్ద అగాథాలు

ప్రజాశక్తి - మామిడికుదురు

మామిడికుదురు నుంచి మగటపల్లి వరకు పంట కాలువ వెంబడి రహదారికి రక్షణ కరువైంది. సంక్రాంతికి ముందు ఈ రహదారి రూ.రెండు కోట్ల పది లక్షలతో అభివృద్ధి చేశారు. వీటి మధ్యలో పంట బోదెలకు నీటిని సరపరాచేసే సుమారు 20 తూముల వద్ద రక్షణ గోడలు లేక బెర్మ్ అంచు క్రమేనా దిగబడిపోతోంది. అక్కడ అగాథంగా మారడంతో ఏ సమయములో ఏ ముప్పు సంభవిస్తుందోనని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు మామిడికుదురు నుంచి మగటపల్లి మధ్య పలుచోట్ల రహదారికిరువైపులా బెర్మ్ ఏర్పాటుకు స్థలం లేక అగాధాలుగా దర్శనమిస్తున్నాయి. తూములకిరు వైపులా మార్జిన్ లేకపోవడంతో ప్రమాదము పొంచి ఉంది. 2015 జూన్‌లో రూ.3.40 కోట్ల వ్యయంతో ఈ రోడ్డు అభివృద్ధి చేశారు. అప్పట్లో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన రక్షణ గోడలు ప్రస్తుతం నిర్వీర్యమ య్యాయి గతంలో కాలువ వెంబడి కాంక్రీట్ రక్షణ గోడ నిర్మించేందుకు రూ.10 కోట్లు కేటాయించగా 2019లో ప్రభుత్వం మారడంతో కాంక్రీట్ రక్షణ గోడ కార్యాచరణకు నోచుకోలేదు. గత ఐదేళ్ల నుంచి ఈ రహదారి ఆధునికీకరణకు నోచుకో లేదు

రక్షణగోడలు నిర్మిస్తేనే ప్రయోజనం

కొమరాడ వంతెన నుంచి మగటపల్లి వరకు రోడ్డు మధ్యలో పంట బోదెలకు నీటిని సరపరా చేసే తూముల వద్ద రక్షణ గోడలు ఏర్పాటు చేకూరితేనే ప్రయోజనం ఉంటుంది. తూములకు రెండు వైపులా రక్షణ గోడలు ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు తూముల సమీపం లో కనీసం హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటు కాకపోవడంతో ముప్పు పొంచి ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు

కొమరాడ పంట బోదె వద్ద దిగబడిన రిటైనింగ్ వాల్ (ఇన్‌సెట్‌లో) హెచ్చరిక బోర్డులుగా కొబ్బరిఆకులు

జలవనరుల శాఖ దృష్టికి తీసుకువెళతాం

కొన్ని చోట్ల బెర్ములు వేయుటకు స్థలము లేకపోవడంతో ఇబ్బందికరంగా ఉంది. తూముల కిరు వైపులా రక్షణ గోడ నిర్మాణం బాధ్యత జల వనరుల శాఖ దృష్టికి తీసుకెళ్తాము. కొన్నిచోట్ల బెర్మ్ వేయటానికి స్థలం లేదు అటువంటి చోట్ల హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తాం.

- సురేష్ , ఆర్అండ్‌బి ఎఇ

అగ్ని ప్రమాద బాధిత కుటుంబానికి సాయం

ప్రజాశక్తి - అల్లవరం

ఇటీవల అగ్ని ప్రమాదంలో నిరాశ్రయులైన దేవగుప్తం గ్రామానికి చెందిన బుంగా చిట్టిబాబు కుటుంబాన్ని ఎపి ఎంఎల్‌సి బొమ్మి ఇజ్రా యేల్ బుధవారం పరామర్శిం చారు. బొమ్మి నరసింహమూర్తి మంగాయమ్మ ఫౌండేషన్ ద్వారా నిత్యావసరాలు, 25 కేజీల బియ్యం, చీరలు, లుం గీలు, రగ్గులు, అవసరమైన దుస్తులు, కూరగాయలు అందించారు. ప్రభుత్వపరంగా బుంగా చిట్టిబాబు కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. చిట్టిబాబు ఇద్దరు కుమార్తెలు వికలాంగులైన కారణ ంగా వారికి ప్రభుత్వం తరపున ఉపాధి కల్పించాలని అన్నారు. వారికి ప్రభుత్వం పక్కా ఇల్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ సాధనాల వెంకట్రావు, చింత రామకృష్ణ, పెచ్చెట్టి వెంకటేశ్వరరావు, ఎన్.ఏలియా రాజు, జంగా వెంకటేష్, బుంగ నాగభూషణం మొదలగు వారు పాల్గొన్నారు.



సాయం అందజేస్తున్న ఎపి ఎస్‌సి వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు

ఎపి ఎస్‌సి వెల్ఫేర్ అసోసియేషన్ సహకారం

బుంగా చిట్టిబాబు కుటుంబానికి ఎపి ఎస్‌సి వెల్ఫేర్ అసోసియేషన్ అల్లవరం మండల శాఖ అధ్యక్షులు ఉప్పే నరసింహారావు, ప్రధాన కార్యదర్శి జనిపెల్ల లోవరాజు చేతుల మీదుగా నిత్యావసరాలు, రూ. 5500 అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు బత్తుల నకుల రాజు, మండల అధ్యక్షులు ఉప్పే నరసి ంహారావు, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి గెడ్డం ప్రదీప్, మండల శాఖ సభ్యులు కేదాసి సత్య నారాయణ, కొను కు శ్రీనివాస్, గుత్తాల వెంకటేశ్వ రరావు, నేల ప్రసాద్, గెడ్డం ఆనంద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

బైకులు ఢీకొని ముగ్గురికి గాయాలు

ప్రజాశక్తి - సీతానగరం

కూనవరం-మిర్తిపాడు రోడ్డులో రెండు బైకులు ఢీకొని ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. కూనవరానికి చెందిన పీతల వీరపండు, కొల్లి బొడ్డియ్య కోరుకొండ వైపు వెళుతుండగా కోటి గ్రామానికి చెందిన అడపా శ్రీనివాస్ బైకులు ఎదురుగా ఢీకొన్నాయి. మంచులో దారి కనిపించక ఈ ప్రమాదం చోటు చేసకుంది. ఈ ప్రమాదంలో గాయపడిన శ్రీనివాస్‌ను ప్రవేట్ ఆసుపత్రికి, బొడ్డియ్యను ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

సలీం మృతదేహం స్వాధీనం

ప్రజాశక్తి - సామర్లకోట

స్థానిక భీమేశ్వరాలయం కొత్త వంతెన పైనుంచి గోదావరి కాలువలో దూకి ఆత్మహత్యకు పాల్పడిన పెదపూడి మండలానికి చెందిన పాత్రికేయుడు షేక్ సలీం మృతదేహం 20 రోజుల తరువాత లభించింది. సామర్లకోట - కాకినాడ రోడ్డులోని గోదావరి కాలువలో లాకులు దాటిన తరువాత గుర్రపు డెక్క మధ్యలో మృతదేహం ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. మృతదేహాన్ని బయటకు తీసి సలీం భార్య, కుటుంబీకులకు సమాచారం అందించారు. వారు మృతదేహం సలీందేనని నిర్ధారించారు. ఈనెల 9వ తేదీ రాత్రి 7 గంటల ప్రాంతంలో స్థానిక రైల్వే గేట్ సమీపంలో వంతెన పైనుంచి గోదావరి కాలువల దూకి ఆత్మహత్యకు పాల్పడగా, అతని కోసం పోలీసులు గాలింపు చర్యలు కొనసాగించారు. కుటుంబ ఆర్థిక పరిస్థితుల కారణంగా సలీం ఆత్మహత్యకు పాల్పడినట్టు తెలుస్తోంది. మృతదేహానికి అక్కడే పోస్టుమార్టం నిర్వహించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ ఎ.కృష్ణభగవాన్ తెలిపారు.

బాలిక భర్త, అత్తల అరెస్టు

ప్రజాశక్తి - పెద్దాపురం

బాలికను ప్రేమ పేరుతో మోసం చేసి పెళ్లి చేసుకుని నిర్బంధించి, వ్యభిచారం చేయమని ఒత్తిడి చేసిన భర్తను, అత్తను అరెస్టు చేసినట్లు డిఎస్‌పి శ్రీహరిరాజు తెలిపారు. బుధవారం డిఎస్‌పి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అనకాపల్లి జిల్లా ఎస్‌రాయవరం మండలం బంగారమ్మ పాలెం గ్రామానికి చెందిన బాలికను పెద్దాపురం ఎన్‌టిఆర్ కాలనీకి చెందిన ధరణికోట చందు ప్రేమ పేరుతో మోసం చేసి ఆమెను తీసుకుని వెళ్ళిపోయాడన్నారు. దీనిపై ఆరు నెలల క్రితం రాయవరం పోలీస్ స్టేషన్‌లో బాలిక తల్లిదండ్రుల చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు అయిందన్నారు. పోలీసులు వారిద్దరినీ తీసుకువచ్చి వారికి, తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇచ్చారన్నారు. ఇరువురి పెద్దలు ఈ సమస్య పరిష్కరించుకుంటామని వెళ్లిపోయారన్నారు. తర్వాత వారిష్ట ప్రకారం పెళ్లి చేసుకుని రాయవరంలో ఉన్నారన్నారు. తర్వాత డిసెంబర్లో పెద్దాపురం వచ్చి ఎన్‌టిఆర్ కాలనీలో నివాసం ఉంటున్నారన్నారు. భార్యాభర్తల మధ్య వచ్చిన మనస్పర్ధలు కారణంగా ఆమె ఆత్మహత్యయత్నానికి ప్రయత్నించిందన్నారు. డిసెంబర్ 28వ తేదీన కాకినాడ ప్రభుత్వాసుపత్రి నుంచి పెద్దాపురం పోలీస్ స్టేషన్‌కు ఇండికేషన్ రాగా పెద్దాపురం పోలీసులు ఆసుపత్రికి వెళ్లి ఆమెను విచారించి మేజిస్ట్రేట్‌చే డిడి చేయించారన్నారు. వైద్య సహాయం అనంతరం ఆమె తల్లిదండ్రులు ఆమెను విశాఖపట్నం నిమ్స్ ఆసుపత్రికి తరలించి చికిత్స నిమిత్తం చేర్పించారన్నారు. ఆమె మాట్లాడటం లేని స్థితిలో ఉన్నందున ఆమె తల్లి దుర్గమ్మ ఇచ్చిన స్టేట్మెంట్ ప్రకారం వ్యభిచారం చేయమని ఒత్తిడి, డ్రగ్స్ ఇచ్చి ఇబ్బంది పెట్టడం మేరకు భర్త, అత్తలపై కేసు నమోదు చేసి అరెస్టు చేశామన్నారు. ఈ సమావేశంలో సిఐ కృష్ణభగవాన్, ఎస్ఐ వి.మౌనిక పాల్గొన్నారు.

అగ్నిప్రమాదంలో తాటాకిల్లు దగ్ధం

ప్రజాశక్తి - కోటనందూరు

మండలంలోని భీమవరపుకోటలో బీద సింహాచలం తాటాకు ఇల్లు దగ్ధం అయింది. బాధితురాలు రోజువారీ కూలీగా హంసవరం ఫ్యాక్టరీలో బుధవారం పనికి వెల్లింది. అయితే ప్రమాదవశాత్తు ఇంటిలో మంటలు వ్యాపించడంతో స్థానికులు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇచ్చారు. హుటాహుటీన సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నించారు. అప్పటికే ఈ ప్రమాదంలో విలువైన వస్తువులతోపాటు, కొంత బంగారం, రూ.63 వేలు నగదు, ఇతర వస్తువులు కాలిపోయాయని బాధితురాలు ఆవేదన వ్యక్తం చేసింది.

పాలకు గిట్టుబాటు ధర కల్పించాలి

ప్రజాశక్తి - కాకినాడ

పాలకు రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని, విశాఖ డైరీని అభివృద్ధి చేయాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు గుర్రాల అప్పారావు కోరారు. బుధవారం జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనాను రైతు సంఘం నాయకులు తిరుమలశెట్టి నాగేశ్వరరావు, వాసంశెట్టి చంద్రరావుతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖ డైరీలో పాలు పోస్తున్న పాల రైతులకు ఆవు పాలకు లీటర్‌కు రూ.2.50 నుంచి రూ.3 వరకూ తగ్గించడం దారుణమన్నారు. పాలకు రేషన్ విధానం ప్రవేశపెట్టడం అంటే రైతు ఎన్ని లీటర్ల పాలు పోస్తే అన్ని లీటర్లు తీసుకోకుండా తిరిగి వెనక్కి ఇచ్చే విధానం వల్ల రైతులకు తీవ్రమైన నష్టం జరుగుతుం దని రేషన్ విధానాన్ని తాము వ్యతిరేకిస్తున్నామన్నారు. వెంటనే రేషన్ విధానాన్ని రద్దు చేసి రైతులు ఎన్ని లీటర్ల పాలు పోస్తే అన్ని లీటర్ల పాలను తీసుకోవా లని కోరారు.

అవగాహనతోనే నేరాలకు దూరం

ప్రజాశక్తి - కాకినాడ

అవగాహనతోనే ప్రమాదాలకు, నేరాలకు దూరం కాగలమని ఎస్‌పి జి.బిందుమాధవ్ అన్నారు. బుధవారం ఆదిత్య డిగ్రీ కళాశాలలో సైబర్ సెక్యూరిటీ, మాదకద్రవ్యాల వ్యతిరేకతపై అవగాహనాసదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. మనం చేసే పొరపాటు వలన మన కుటుంబంతోపాటు, ఇతరులు కూడా ఇబ్బంది పడే పరిస్థితి వస్తుందని అన్నారు. తగు జాగ్రత్తలు తీసుకోవాలని, ట్రాఫిక్ నియమాలను పాటిస్తూ వాహనాలను నడపాలని తెలిపారు. హెల్మెట్ ఆవశ్యకత, రేష్ డ్రైవింగ్ వల్ల జరుగుతున్న అనర్థాలను వివరించారు. సైబర్ సెక్యూరిటీ విషయంలో తగు జాగ్రత్తలు తీసుకుంటూ ప్రభుత్వ సూచనలను పాటించాలని అన్నారు. కార్యక్రమంలో ఎస్ఐలు విద్యార్థులు పాల్గొన్నారు.

'సూర్యఘర్' అమలుపై కలెక్టర్ సమీక్ష

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్ కుమార్

ప్రజాశక్తి - అమలాపురం

స్థానిక కలెక్టరేట్ నందు పిఎం సూర్య ఘర్ పథకం అమలు తీరు పురోగతిపై అధికారులతో బుధవారం కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ బిల్లుల చెల్లింపుల భారం తగ్గించేందుకు అమలు చేస్తున్న పిఎం సూర్యఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకొని ప్రతి ఇంటిని సూర్యఘర్ వెలుగులతో నింపుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. సోలార్ ప్యానల్ కనెక్షన్ల కొరకు తక్షణమే పేర్లు నమోదు చేసుకొని విద్యుత్ చెల్లింపుల భారం తగ్గించాలన్నదే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశం అన్నారు. ముందుగా బల్క్ వినియోగదారు లను పట్టణ ప్రాంతంలో బల్క్ వినియోగదారు లను గుర్తించి పథకాన్ని పరిపూర్ణంగా వర్తింప జేయాలని ఆదేశించారు. ఎస్‌సి, ఎస్‌టి ఆవాసాలలో లబ్ధిదారులను కూడా గుర్తించి పథకం అమలుకుచర్యలు చేపట్టాలన్నారు. గృహ వినియోగ దారులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకుని విద్యుత్తు ఉత్పత్తిదారులుగా మారాలన్నారు. ప్రజలకు విద్యుత్ చెల్లిం పుల భారాన్ని తగ్గించేం దుకు కేంద్ర ప్రభుత్వం అతి తక్కువ ఖర్చుతో లబ్ధిదారులు ఇంటి పై సోలార్ ప్యానలను ఏర్పాటు చేసుకోవడం ద్వారా తయారైన విద్యుత్ ను ఉచితంగా గృహ అవసరాలకు వినియోగించుకుంటే విద్యుత్ బిల్లులు చెల్లించ వలసిన అవసరం ఉండ దన్నారు. తద్వారా ఎంతో ఆర్థిక ప్రయోజనం పొంద గలుగు తారన్నారు. ట్రాన్స్‌కో ఇఇ రవికుమార్ మాట్లాడుతూ జిఎస్‌టి ఆదాయపు పన్ను చెల్లిస్తున్న వర్తకులతో సమా వేశం నిర్వహించి పథక అమలు తీరుపై త్వరలో కలెక్టర్ అధ్యక్ష తన సమీక్షిస్తారన్నారు. కార్యక్రమంలో నాబార్డ్ జిల్లా అభివృద్ధి మేనేజర్ స్వామి నాయుడు, జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ పథక సంచాలకులు డాక్టర్ శివ శంకర్ ప్రసాద్, ఎల్‌డి ఎంపి కేశవ వర్మ, అరక గ్రీన్ టెక్ ప్రయివేటు లిమిటెడ్ చీఫ్ సేల్స్ మేనేజర్ నందేపు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కుష్టును నిర్లక్ష్యం చేస్తే శాశ్వత వైకల్యం

కుష్టు వ్యాధి ప్రాణాం తకమైనది కానప్పటికీ నిర్లక్ష్యం చేస్తే శాశ్వత వైకల్యాన్ని కల్గించగల మహమ్మారని కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ తెలిపారు. బుధవారం స్థానిక కలెక్టరేట్ లోని జిల్లా కలెక్టర్ వారి ఛాంబర్ నందు స్పర్శ కుష్టి వ్యాధి ప్రచార కార్యక్రమం పోస్టర్‌ను యన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో అంతంత మాత్రంగానే ఉన్న ఈ వ్యాధి తీవ్రత ఇటీవల కాలంలో పెరుగుతున్నట్లు వైద్య శాఖ అంచనా వేస్తోందన్నారు. దీంతో అప్రమత్తమైన జాతీయ ఆరోగ్య మిషన్ కుష్టు వ్యాధిగ్రస్థులు, లేదా ఆ లక్షణాలు కల్గిన వారి వివరాలను తెలుసుకోవాలని సంకల్పించిం దన్నారు. ఇందులో భాగంగా 14 రోజుల పాటు ఇంటింటా లెప్రసీ(కుష్టు) ప్రచార కార్యక్రమం చేపట్టారన్నారు లక్షణాలు ఉన్న వారికి మందులు ఇస్తూ తరుచుగా వారిని పరీక్షించేలా ఏర్పాట్లు కొనసాగుతున్నాయన్నారు. అదనపు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిని జిల్లా కుష్టు వ్యాధి నియంత్రణ అధికారిని డాక్టర్ సిహెచ్ వి.భరతలక్ష్మి మాట్లాడుతూ జిల్లాలో స్పర్శ కుష్టు వ్యాధి ప్రచార కార్యక్రమం ఈనెల 30వ తేదీ నుంచి ఫిబ్రవరి 13వ తేదీ వరకు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పలుచోట్ల ఉచిత పశు వైద్య శిబిరాలు

వాడపాలెంలో గొర్రెలు, మేకల పెంపకం దారులకు మందులు అందజేస్తున్న ఉప సర్పంచ్

ప్రజాశక్తి - యంత్రాంగం

జిల్లాలో పలుచోట్ల బుధవారం ఉచిత పశు వైద్యశిబిరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పశు వైద్యాధికారులు పశువులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం పాడి రైతులకు ఉచితంగా మందులు అందజేశారు.

కొత్తపేట: వాడపాలెం గ్రామంలో బుధవారం ఉచిత పశు వైద్యశిబిరాన్ని గ్రామ ఉపసర్పంచ్ నాగ లక్ష్మీకాంతం ప్రారంభించారు. ఆమె మాట్లాడుతు పాడిరైతులు ఉచితశిబిరాలను సద్వినియోగం చేసుకుని, పశువులకు జబ్బులు రాకుండా ముందుగా, టీకాలు వేయించుకోవాలను సూచించారు. అనంతరం గొర్రెలు, మేకల పెంపకం దార్లకు నట్టల నివారణమందులు, లివర్ టానిక్ పంపిణీ చేశారు.వానపల్లి గ్రామీణ పశువైద్యశాల వెటర్నరి లైవ్స్టుక్ ఆఫీసర్ విఎల్ఓ జి.ప్రసాద్‌రావు, పశువులను పరీక్షించి, గర్భకోశ వ్యాధులకు సంబందించి, మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం లో పంచాయితి సభ్యులు ఎ. ప్రసన్న కుమార్, కె.గోవిందరావు, ఎం.అయ్యప్ప, స్థానిక నాయకులు బీర.రమేష్, మందపల్లి డిహెచ్ఎ బి.రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆలమూరు: పాడి రైతులు ఉచిత పశు వైద్య సేవలు వినియోగించుకోవాలని మండల డిస్ట్రిబ్యూటరీ కమిటీ మాజీ చైర్మన్ నాగిరెడ్డి వెంకటరత్నం, మాజీ ఎంపిటిసి సభ్యుడు నాగిరెడ్డి వెంకటేశ్వరరావు, వైద్యాధికారి డాక్టర్ డి.భాను ప్రసాదరావు అన్నారు. కూటమి ప్రభుత్వం పశుసంతతి పురోభివద్ధి కోసం నిర్వహిస్తున్న కార్యక్రమాలలో భాగంగా మండలంలోని చెముడులంకలో ఏర్పాటు చేసిన ఉచిత పశు ఆరోగ్య శిబిరాన్ని బుధవారం వారు ప్రారంభించారు. ఇందులో భాగంగా పశువులకు నట్టల నివారణ, వ్యాధి నిరోధక టీకాలు, గర్భకోశ సంబంధిత వ్యాదులు వంటి వాటికి వైద్య పరీక్షలు పూర్తిచేశారు. అలాగే పాడి రైతులకు పశువుల ఆరోగ్య రక్షణకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కొత్తపల్లి రాంబాబు, సిరంగుల సతీష్, గుండుమల్ల రాంబాబు, అడబాల వీర్రాజు, జెఈవోలు డాక్టర్ కె.తిరుమల రాజా, వి.సూర్యనారాయణ మూర్తి, కె.విజయబాబు, విహెచ్ఏలు భవాని, రాజేష్, జాన్, తదితరులు పాల్గొన్నారు.

నర్సిపూడిలో ఏర్పాటుచేసిన పశు వైద్య శిబిరం

బంగారుపతక విజేత రవితేజను అభినందిస్తున్న ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్

విజేతలకు పలువురి అభినందన

ప్రజాశక్తి - యంత్రాంగం

రాజోలు నియోజకవర్గం మలికి పురం మండలం కేశనపల్లిలో ఈ నెల 27,28 తేదీల్లో మొదటి జాతీయ స్థాయి ప్రొఫెషనల్ ఫొటో వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ వర్క్ షాపులో ప్రతిభ చూపిన బంగారు, వెండి పతకాలు సాధించిన వారికి బుధవారం పలువురు అభినందనలు తెలిపారు.

రాజోలు: ఫొటోగ్రఫీ వర్క్‌షాప్‌లో బంగారుపతకం సాధించిన కాకర రవితేజను పలువురు బుధవారం అభినందించారు. సఖినేటిపల్లి ప్రొఫెషనల్ ఫొటో, వీడియోగ్రాఫర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 27,28 తేదీల్లో కేశనపల్లిలో ఫొటోగ్రఫీ వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా పొదలాడ. గ్రామానికి చెందిన వితేజకు బంగారు పతకం లభించింది. రెండు రోజులపాటు జరిగిన ఈవర్క్ షాప్ లో సుమారు 40 మంది పాల్గొన్నారు. బంగారు పతకం సాధించిన రవితేజను తాటిపాకలో ఫొటో గ్రాఫర్స్ అసోసియేషన్ నాయకులు ముసిని వెంకటేశ్వరరావు, బాబులు, శివరామ మాస్టర్, నల్లి శ్రీనివాస్, బుంగా రత్నంకుమార్, జి.సునీల్. రాజమహేంద్రవరం ప్రింటోనికా ల్యాబ్ మురళి, భాను, రాజా, ధనరాజు, ఎం.శేఖర్‌బాబు అభినందనలు తెలియజేశారు. **మామిడికుదురు:** కేశనపల్లి లో జరిగిన మొదటి జాతీయ సాయి ప్రొఫెషనల్ పొటో వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ వర్క్ షాపులో నగరానికి చెందిన మీర్ జవాద్ అలీ తీసిన ప్రకృతి సోయగం చిత్రానికి వెండి పతకం లభించింది. ఈ విషయాన్ని అలీ బుధవారం తెలిపారు. శంకరగుప్తం డ్రెయిన్‌లో పసుపు రంగు తెరచాప పడవలో మత్యకారుడు వల విసురుతున్న అద్భుతమైన దృశ్యాన్ని కెమెరాలో అలీ బంధించారు ఈ చిత్రానికి జాతీయస్థాయిలో బహుమతి గెలుచుకుంది ఈ సందర్భంగా అలీని పలువురు అభినందించారు.

మాట్లాడుతున్న మండల డిసి అధ్యక్షుడు గోపాలస్వామి

సాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు

ప్రజాశక్తి - ఆలమూరు

సాగునీరు సమస్య పరిష్కారానికి తక్షణ చర్యలు చేపడతామని మండల డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఛైర్మన్ మెర్ల గోపాలస్వామి అన్నారు. మండలంలోని చొప్పెల్ల లాకుల వద్ద మూలస్థానంకు వెళ్లే సైడ్ కాలువ సమస్యపై మండల డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఛైర్మన్ మెర్ల గోపాలస్వామి అధ్యక్షతన బుధవారం ఇరిగేషన్ ఎఇ కృష్ణ త్రిమూర్తులు ఆధ్వర్యంలో రైతులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలోముందుగా రైతులతో మాట్లాడారు. శిధిలమైన లాకుల గేట్లు గురించి చర్చించారు. అలాగే బాగు చేసేందుకు స్థానిక ఎంఎల్ఎ బండారు సత్యానందరావు దృష్టికి తీసుకుని వెళతానని గోపాలస్వామి అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ టిడిపి అధ్యక్షుడు బల్ల హరికృష్ణ, పలువురు రైతులు పాల్గొన్నారు.

నందంపూడిలో రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్

రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - అంబాజీపేట

నందంపూడిలో అనిశెట్టి వారి పాలెం, విప్పర్తి వారి పాలెం లలో 15వ ఆర్థిక సంఘం నిధులచే నిర్మించే సిసి రోడ్ల నిర్మాణ పనులకు బుధవారం సర్పంచ్ పితాని మంగాదేవి వీరాస్వామి శంకుస్థాపన చేశారు. కూటమి ప్రభుత్వం సహాయ సహకారాలతో మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక దృష్టి సారిస్తానని సర్పంచ్ అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి, జనసేన గ్రామ శాఖ అధ్యక్షులు కేతా అర్జునుడు, బెండా శ్రీను, ఉపసర్పంచ్ నేదునూరి మురళీకృష్ణ, మంద వెంకటేశ్వరరావు, విప్పర్తి శ్యామలారాణి, దొమ్మేటి ఆది వెంకటేశ్వరరావు, పితాని బుజ్జి, పితాని రమేష్, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ తదితరులు పాల్గొన్నారు.

కార్మిక శాఖ మంత్రుల సమావేశానికి సుభాష్ హాజరు

ప్రజాశక్తి - రామచంద్రపురం

కేంద్ర కార్మిక శాఖ ఏర్పాటు చేసిన రాష్ట్ర కార్మిక మంత్రుల సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వం తరపున ఆంధ్రప్రదేశ్ కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పాల్గొన్నారు. పేదరిక నిర్మూలన లక్ష్యంగా రాష్ట్రాలు తీసుకోవాల్సిన చర్యలపై ఈ సమావేశం ఏర్పాటు చేశారని మంత్రి కార్యాలయం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. న్యూఢిల్లీలో జరుగుతున్న అన్ని రాష్ట్రాల కార్మిక శాఖ మంత్రుల సమావేశంలో కేంద్ర కార్మిక శాఖ మంత్రి మాండవియా రాష్ట్ర మంత్రులతో పలు అంశాలను చర్చించారు. సమావేశంలో సుభాష్ మాట్లాడుతూ కార్మిక సంస్కరణలు 2015 నుండే అమలు చేశారని వాటినే ఇప్పుడు కేంద్రం అమలు చేస్తుంది అని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ పారిశ్రామికీకరణలో ముందంజలో ఉండడంతో పాటు కార్మికుల సంక్షేమం పట్ల కూడా ఎంతో శ్రద్ధ వహిస్తుందన్నారు. కార్యక్రమంలో పలు రాష్ట్రాల కార్మిక శాఖ మంత్రులు పాల్గొన్నారు.

బి.దొడ్డవరంలో విగ్రహ ప్రతిష్టాపన

ప్రజాశక్తి -మామిడికుదురు

బి.దొడ్డవరంలో ప్రజా విరాళాలు రూ.కోటి వ్యయంతో నూతనంగా నిర్మించిన శ్రీ ఉమా సోమేశ్వర స్వామి ఆలయములో విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. జగన్నాథ శర్మ ఆధ్వర్యంలో గణపతి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, శ్రీ పార్వతి దేవి, శ్రీ సోమేశ్వర స్వామి, పానపట్ట లింగం, రెండు వషభాలు, నూతన ధ్వజస్తంభం, బలిపీఠం, ఆలయ శిఖరాలను, సువర్ణ యంత్ర పున్ణ ప్రతిష్ట ఉత్సవాలను నిర్వహించారు కంభంపాటి సుబ్రహ్మణ్య శ్రీనివాస శర్మ, పోచిరాజు వెంకట రామ నాగేశ్వరరావు, పోచిరాజు కిరణ్ కుమార్ దంపతులు కర్తలు గా పాల్గొని నూతన విగ్రహాలు ను పాలతో సంప్రోక్షణ, యాగశాల ప్రవేశం, కలశ స్థాపన పూజలు నిర్వహించారు.

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ప్రజాశక్తి - రావులపాలెం

అభివృద్ధి , సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎంఎల్ఎ బండారు సత్యానందరావు అన్నారు. స్థానిక ఎంఎల్ఎ క్యాంపు కార్యాలయం వద్ద బుధవారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రూ.పది లక్షల కోట్ల అప్పులు చేసి గత వైసిపి సర్కార్ జనం నెత్తిన పిడుగు భారం మోపిందని మండిపడ్డారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం గడిచిన ఏడు నెలల్లో గత వైసిపి సర్కార్ పెట్టిన రూ.22 వేల కోట్ల బకాయిలను విడుదల చేసినట్లు గుర్తు చేశారు. కార్యక్రమంలో గుత్తుల రాంబాబు, బండారు సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

రహదారి భద్రతపై అవగాహనా ర్యాలీలు

కొత్తపేటలో అవగాహనా ర్యాలీలో పాల్గొన్న ఎంఎల్ఎ

ప్రజాశక్తి - యంత్రాంగం

జిల్లాలో పలుచోట్ల రోడ్డు భద్రతపై అవగాహనా ర్యాలీలు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొని పలు అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.

కొత్తపేట: స్థానిక పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన బైక్ ర్యాలీలో ఎంఎల్ఎ బండారు సత్యానందరావు హెల్మెట్ ధరించి ర్యాలీలో పాల్గొన్నారు. రోడ్డు భద్రతా నియమాల అవగాహనలో భాగంగా వాడపాలెం గ్రామం నుండి కొత్తపేట మారుతీ నగర్,కౌశిక రోడ్డు మీదుగా బస్టాండ్ సెంటర్ మీదుగా కొత్తపేట ప్రధాన రహదారిపై బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కొత్తపేటలో జరిగిన సమావేశంలో యువ నాయకులు బండారు సంజీవ్, సిఐ విద్యాసాగర్, తహశీల్దారు యడ్ల రాంబాబు,నాలుగు మండలాల స్టేషన్ ఇన్స్పెక్టర్లు పాల్గొన్నారు. రోడ్డు భద్రతా,ప్రమాదాల నివారణపై ప్రజలకు, వాహనదారులకు అవగాహన కల్పించేందుకు వినూత్న కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. రోడ్డు ప్రమాదాలు జరిగి ఏ ఒక్కరూ విలువైన ప్రాణాలు కోల్పోకూడదనే ప్రభుత్వ ముఖ్య ఉద్దేశ్యం అని తెలిపారు.అందుకే అందరికీ అవగాహన కల్పిస్తున్నామని అన్నారు. గతంలో మన నియోజకవర్గంలో గంజాయి ఏరులై పారేదని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నియోజకవర్గంలో ఎటువంటి మత్తు పదార్థాల అవశేషాలు కూడా లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను సత్యానందరావు ఆదేశించారు. సైబర్ నేరాల పట్ల అందరూ అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వం,అధికారులు సూచించిన నియమాలను పాటించాలని ఎంఎల్ఎ సత్యానందరావు కోరారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. **రామచంద్రపురం :** రహదారి భద్రత వారోత్సవాల్లో భాగంగా రామచంద్రపురంలో డిఎస్‌పి రఘువీరా ఆధ్వర్యంలో పోలీసులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలని యువకులు ప్రాణాలు రక్షించుకోవాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డిఎస్‌పి మాట్లాడుతూ రామచంద్రపురం నుంచి మండపేట వరకు ర్యాలీ నిర్వహించి హెల్మెట్ వాడకంపై అవగాహన కల్పిస్తామని వివరించారు రోడ్డు ప్రమాదాలు గంటకు 50కు పైగా జరుగుతున్నాయన్నారు. వీటిలో 20 మంది ప్రాణాలు కోల్పోతున్నారని వివరించారు. భారతదేశంలో హెల్మెట్ వాడకపోవటం వలన 87 శాతం మరణాలు సంభవిస్తున్నాయని వీటిని నివారించేందుకు వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని కోరారు. మండపేట రాయవరం రామచంద్రపురం, కె.గంగవరం ద్రాక్షారామ పోలీస్ స్టేషన్ నుండి పోలీసులు ఈ ర్యాలీ కార్యక్రమంలో పాల్గొన్నారు.

రామచంద్రపురం లో హెల్మెట్ పై అవగాహన ర్యాలీ

ఎంబ్రాయిడరీ వర్క్ వివరాలు తెలుసుకుంటున్న ద్రాక్షారామ విద్యార్థులు

వృత్తి విద్యాకోర్సులపై అవగాహన

ప్రజాశక్తి - రామచంద్రపురం

వృత్తి విద్య కోర్సులపై విద్యార్థులకు అవగాహనా సదస్సు ఏర్పాటు చేశారు. ద్రాక్షారామంలో జరిగిన ఈ శిక్షణా కార్యక్రమంలో కోర్సుల వివరాలు తెలియజేశారు. ప్రతి నెలా నాలుగు ఇండస్ట్రియల్ విజిట్లు చేయాలని నిర్ణయించారు .విద్యార్థులకు వృత్తి విద్యపై అవగాహన కల్పించేందుకు విఅండ్‌సి ఎంబ్రాయిడింగ్ వర్క్ పరిశ్రమను సందర్శించి వివరాలు తెలుసుకున్నారు. పర్యటనలో విద్యార్థులు ఎంబ్రాయిడరీ రంగంలో ఉన్న అవకాశాలు, వాటిని మెరుగుపరచుకునే మార్గాలు, ఎంబ్రాయిడరీకి అవసరమైన పరికరాలు, వాటి వినియోగం గురించి వివరించారు. వృత్తి శిక్షణ నిపుణుడు రెడ్డి కనక రాజశేఖర్ విద్యార్థులకు ఎంబ్రాయిడరీ పనిని వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల గణిత ఉపాధ్యాయురాలు వి.భాను గాయత్రి, క్రాఫ్ట్ ఉపాధ్యాయురాలు ధనలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థులలో వత్తి విద్యపై ఆసక్తిని పెంచేందుకు ఇలాంటి పరిశీలన పర్యటనలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని తెలియజేశారు. పలువురు విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

వరి సాగులో సస్య రక్షణ కీలకం

ప్రజాశక్తి - కాజులూరు

వరి సాగులో సస్యరక్షణ కీలకమని పెద్దాపురం ఏరువాక శాస్త్రవేత్త ఎఎస్ఆర్.శర్మ అన్నారు. బుధవారం మండలం లోని కోలంక గ్రామంలో మండల వ్యవసాయ అధికారి అశోక్ ఆధ్వర్యంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శర్మ మాట్లాడుతూ వరి సాగులో సస్యరక్షణ కీలకమని, ప్రతి తెగులుకి అధికారులను సంప్రదించి మందులు వినియో గించుకున్నట్లయితే రైతులు ఆర్థికంగా ఇబ్బందులు కలగవన్నారు. ఏ తెగులుకి ఏ మందులు వాడుతున్నారో తెలుసుకుని వారి అనుమానాలను నివీత్తి చేశారు. ప్రస్తుతం తెగులుకు వినియోగిస్తున్న మందులను వివరించి పరిశోధనలో ఉన్న మందులను వివరించారు. పిచికారిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు. ఎన్‌పిపిఎస్ యాప్ ద్వారా పంటకు హాని కలిగించే పురుగు, తెగులను గుర్తించి ఏ మందులు వాడాలో రైతులకు అవగాహన కల్పించారు. సహకార సంఘం మాజీ అధ్యక్షులు డివి నరసింహరాజు, భూపతిరాజు రామచంద్రరాజు మాట్లాడుతూ రైతులకు రాయితీపై యంత్ర పరికరా లను అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌సి ఎడిఎ మాధవి, కోటిపల్లి సాగునీటి పంపిణీ సంఘం అధ్యక్షులు దాట్ల విజయ గోపాలరాజు, మండల విస్తరణ అధికారి శ్రీనివాస వర్మ, సచివాలయ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ 1వ అదనపు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, రాజమహేంద్రవరం
E.A. No. 198/2018
E.P. No. 69/2016 in
O.S. No. 106/2016

Between:
1. Mallidi Veera Raghava Reddy
2. Mallidi Satish Kumar Reddy
3. Mallidi Srinivasa Reddy
...Claim Petitioners
AND
Akella Srinivasa Rao and Others
...Respondents/ JDrs

3. Mallidi Naga Sivani, D/o. late Venkata Rama Reddy, Hindu, aged 14 years, Kuthukuluru Village, Anaparthi Mandal, East Godavari RJCJ, being minor represented by her mother and natural guardian Mallidi Leelavathi, W/o. late Venkata Rama Reddy.
...3rd Respondent/ JDr

పై నెంబరు క్లెయిమ్ పిటీషన్‌లో 3వ రెస్పాండెంటు/ JDr అయిన మీకు కోర్టు ద్వారా ఎన్నిసార్లు సమన్లు/ నోటీసులు పంపినా మీరు వాటిని తీసుకోకుండా ఉద్దేశ్యపూర్వకంగా త్రిప్పి వేయుచున్నారు. కావున **ది. 03-02-2025 సం॥రం తేదీ ఉదయం 10.30 ని॥లకు** మీరు స్వయంగా గాని, లేదా ప్లీడరు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి సదరు పై క్లెయిమ్ పిటీషన్‌లో మీ ఆక్షేపణలను తెలుపుకొనవలెను. లేనియెడల సదరు క్లెయిమ్ పిటీషన్‌ను మీకు పరోక్షముగా శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
రాజమండ్రి 21-1-2025 — **కె.జగదీష్‌కుమార్** అడ్వకేట్, రాజమండ్రి

In the Court of the Vth Addl. District Judge (MACT), E.G.Dt., Rajahmundry
M.V.O.P. No. 529/2022

Between:
1. కరాం లలితకుమారి @ మినప లలిత కుమారి మరియు అదర్స్ -పిటీషనర్స్
మరియు
1. కుర్ల ఆదిత్య రెడ్డి మరియు అదర్స్ -రెస్పాండెంట్స్

1వ రెస్పాండెంటు:
కుర్ల ఆదిత్య రెడ్డి, S/o. రాజారెడ్డి, హిందువు, వయస్సు 27 సం॥లు, Owner Cum Driver of FZS Motor Cycle bearing No: AP 39 LT 6607, R/o. D.No. 6-12, చెలుక వీధి, రంపచోడవరం మండలం, కాకవాడ గ్రామం, తూర్పుగోదావరి జిల్లా. -రెస్పాండెంట్

పై నెంబరు ఒ.పి.లో శ్రీ కోర్టు వారు మీకు ఎన్నిసార్లు సమన్లు పంపినను ఉద్దేశ్యపూర్వకంగా తీసుకొనక తప్పుదారి పట్టిస్తూ కాలయాపన చేయుచున్నారు. కాబట్టి సదరు రెస్పాండెంట్ వాయిదా రోజు అనగా **07-02-2025వ తేదీ ఉదయం 10.30 గంటలకు** కోర్టుకు హాజరై ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనిచో మీ పరోక్షమున తీర్మానించబడును.
పిటీషనర్ తరపు న్యాయవాది
రాజమండ్రి తేది:24-1-2025 — **జి.శ్రీనివాస్** అడ్వకేట్, రాజమండ్రి

విద్యానిధి నాయుడుకు అభినందన

ప్రజాశక్తి - అమలాపురం

నన్నయ విశ్వవిద్యాలయ అనుబంధ డిగ్రీ కళాశాల యాజమాన్యాల ఎన్నికల్లో ఉపాధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నికైన ఆకుల బాపన్న నాయుడును ఎపి ప్రయివేట్, అన్ ఎయిడెడ్ మేనేజ్మెంట్ స్కూల్స్ అసోసియేషన్' నాయకులు బుధవారం సత్కరించారు. ప్రయివేట్ విద్యాసంస్థల సమస్యలను ప్రభుత్వానికి ప్రాతినిధ్యం చేసి, పరిష్కారం కోసం కృషి చేయాలని కోరారు. అసోసియేషన్ జిల్లా గౌరవాధ్యక్షులు దొడ్డా సత్తిబాబు, జిల్లా అధ్యక్షులు ఎస్‌వి.రమణారావు, కార్యదర్శి టిఎస్ఆర్.అయ్యప్పనాయుడు, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆర్.గోపీనాథ్, డివిజన్ అధ్యక్షుడు రత్నం రాజు, నాయకులు కడలి సుబ్రహ్మణ్యం, గోపాలకృష్ణ తదితరులు నాయుడును అభినందించారు.

నాయుడును అభినందిస్తున్న అసోసియేషన్ సభ్యులు

ముమ్మిడివరం నగర పంచాయతి
ఆర్ఓసి నెం. 4/2025/ఇ1 — ది.29-01-2025
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు నోటీసు

ముమ్మిడివరం నగర పంచాయతీ, ఇంజనీరింగు విభాగమునకు సంబంధించి MPLADS 2024-25 నిధులతో రెండు (2) పనులకు సిసి రోడ్లు వేయుటకు రూ. 50.00 లక్షల అంచనాలతో ఇ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా టెండర్లు పిలువబడినవి.

బిడ్ డాక్యుమెంట్ ప్రారంభ తేది	: 30-01-2025 ఉదయం గం॥ 11.00ల నుండి
బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ ఆఖరు తేది	: 15-02-2025 సాయంత్రం గం॥ 3.00ల వరకు
బిడ్ డాక్యుమెంట్ తీసుకొనుటకు ఆఖరు తేది	: 15-02-2025 సాయంత్రం గం॥ 4.00లకు

మిగిలిన వివరముల కొరకు కార్యాలయ పని వేళలలో ఇంజనీరింగు విభాగము నందు సంప్రదించగలరు.
సం/- **కమిషనరు**, ముమ్మిడివరం నగర పంచాయతీ